క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


ప్రవీణ్‌కుమార్, ఎస్సై

దత్తిరాజేరు: మండలంలోని ఎస్. బూర్జవలస పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా లక్ష్మీ ప్రసన్నకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన రాజేష్‌కు విజయనగరం వన్‌టౌన్‌కు బదిలీ జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, సిబ్బంది సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

తక్షణ సాయం అందజేత


మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న సర్పంచ్ గర్బాపు విజయలక్ష్మి

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామానికి చెందిన మామిడి అప్పారావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా దహన సంస్కారాలకు తక్షణ సాయంగా రూ. 10 వేలు సర్పంచ్ గర్బాపు విజయలక్ష్మి శుక్రవారం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మరికొద్ది రోజుల్లో మిగిలిన పరిహారం మంజూరవుతుందని చెప్పారు. పేద కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఎంతో ఆసరా అని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రవి, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం


కోలాటం ప్రదర్శన

చీపురుపల్లి రూరల్: కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. ధర్మప్రచార వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా అలజంగి శ్రీరాధాకృష్ణ కోలాట బృందానికి చెందిన చిన్నారులు ఆలయ పరిసరాల్లో కోలాటం ప్రదర్శించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాస్, కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్, వైస్ చైర్మన్ సూరుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మెరకముడిదాం: మండల స్థాయి ఖాదీ మహోత్సవంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర సమగ్రశిక్ష కార్యాలయం ఆదేశాల మేరకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎంఈఓలు ఎం.చంద్రశేఖర్,ఎం.ప్రసాదరావు బహుమతులు అందజేశారు. మండల స్థాయి విజేతలు ఈనెల 28న జరగనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం. ఎల్లంనాయుడు పాల్గొన్నారు.

ఈక్రాప్‌పై సోషల్ ఆడిట్


జాబితాను పరిశీలిస్తున్న స్థానిక నాయకులు

గుర్ల: మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రం వద్ద వీఏఏ కృష్ణారావు సమక్షంలో ఈక్రాప్‌పై శుక్రవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాబితాలో ఎటువంటి పొరపాట్లు దొర్లినా, అభ్యంతరాలున్నా తెలియజేయాలని వీఏఏ కృష్ణారావు కోరారు. కార్యక్రమంలో రైతులు, స్థానిక నేతలు ఇజ్జిరోతు ప్రసాద్, సతివాడ సీతారాం, బోడశింగి అప్పలనాయుడు, సారికి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి సింహద్వారం ప్రారంభం


అమ్మవారి సింహద్వారాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని గూడెం జంక్షన్ వద్ద నిర్మించిన పున్నపురెడ్డిపేట దుర్గాదేవి సింహద్వారాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సింహద్వారం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, సర్పంచ్ ఎజ్జిపరపు లక్ష్మణరావు, ఆలయ ధర్మకర్త రామారావు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని నోట్స్ పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడి


ఆర్‌బీకేలో సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, తదితరులు

అడగకుండానే అన్నీ ఇచ్చారు...

- జగన్ మామయ్యకు థ్యాంక్స్ చెప్పండి
- గొట్లాం జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించిన మంత్రులు
- విద్యాబోధన, వసతుల కల్పనపై మంత్రుల ఎదుట సంతోషం వ్యక్తం చేసిన విద్యార్థులు

బొండపల్లి: అడగకుండానే అన్నీ సమకూరుస్తున్న ముఖ్యమంత్రి జగన్ మామయ్యకు మా తరఫున థ్యాంక్స్ చెప్పాలని గొట్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంత్రులకు విన్నవించారు. సామాజిక సాధికార బస్సుయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రులు గొట్లాంలో గల జిల్లా పరిషత్ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు మధ్యాహ్న భోజనం సక్రమంగా పెడుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. పాఠశాలలు ప్రారంభించే సమయానికల్లా పుస్తకాలు, బ్యాగులు, బూట్లు అందిస్తున్నారని.. అలాగే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారని విద్యార్థులు తెలిపారు. ఈ సమయంలో మంత్రులు కలుగజేసుకుని ఈ విషయాలన్నీ మేము వచ్చామని చెబుతున్నారా.. లేక మనస్ఫూర్తిగా చెబుతున్నారా.. అని ప్రశ్నించగా.. విద్యార్థులందరూ ముక్తకంఠంతో మనస్ఫూర్తిగా చెబుతున్నామని బదులిచ్చారు. దీంతో జగన్ మామయ్యకు మీ తరఫున ఏమి చెప్పాలో తెలియజేయాలని మంత్రులు కోరగా.. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేయాలని విద్యార్థులు చెప్పారు.

రూపాయి అవినీతి లేకుండా..

పాఠశాల సందర్శన అనంతరం మంత్రుల బృందం గ్రామంలోని సచివాలయం, ఆర్‌బీకేలను పరిశీలించారు. నాలుగున్నర సంవత్సరాల వ్యవధిలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు ఎంత నగదు జమ చేశారని సచివాలయ సిబ్బందిని ప్రశ్నించగా.. సుమారు రూ.7.12 కోట్లను లబ్ధిదారులకు అందజేసినట్లు సిబ్బంది తెలిపారు. దీనికి మంత్రులు స్పందిస్తూ, ఒక్క రూపాయి అవినీతి లేకుండా సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆర్‌బీకేల ద్వారా కూడా రైతులకు మెరుగైన సేవలందిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు విజయనగరం నుంచి గొట్లాం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం, ఎస్.కోట, పార్వతీపురం, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, కడుబండి శ్రీనివాసరావు, అలజంగి జోగారావు, పాముల పుష్పశ్రీవాణి, కంబాల జోగులు, ఎమ్మెల్సీలు, పి.సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు), ఇందుకూరి రఘురాజు, పాలవలస విక్రాంత్, తూర్పుకాపు సంక్షేమ సంఘ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్, గిరిజన కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, డీఈఓ లింగేశ్వరరెడ్డి, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు రాపాక సూర్యప్రకాశ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి రమణ, మీసాల తులసీరామ్, మీసాల సరోజిని, సర్పంచ్ మండా ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రులు


ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీ, తదితరులు


బస్సుపై నుంచి వైఎస్సార్‌సీపీ జెండాతో సందడి చేస్తున్న యువకుడు


వేదికపై ఆసీనులైన మంత్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

స్పందన అపూర్వం..



గజపతినగరం రోడ్డులో బస్సుయాత్రకు స్వాగతం పలుకుతున్న పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, (ఇన్‌సెట్లో) జగనన్న ఫేస్‌మాస్క్‌తో చిన్నారి

- సామాజిక సాధికార బస్సుయాత్రకు బ్రహ్మరథం
- బహిరంగ సభకు పోటెత్తిన ప్రజానీకం
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

బొండపల్లి/గజపతినగరం/గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రకు అపూర్వ స్పందన లభించింది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రజలు బహిరంగ సభకు తరలివచ్చారు. మెంటాడ రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సాయంత్రం మూడు గంటలకే ప్రజలు అధిక సంఖ్యలో చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది. మంత్రులకు స్వాగతం పలుకుతూ జాతీయ రహదారి 26కి ఇరువైపులా ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలు ఆకర్షణీయంగా కనిపించగా.. మరోవైపు బహిరంగ వేదికపై వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష, బృంద సభ్యులు ఆలపించిన గీతాలు అభిమానులను ఉర్రూతలూగించాయి. అలాగే ముచ్చర్ల గ్రామానికి చెందిన మహిళలు కోలాటం, తప్పెటగుళ్ల.. విజయనగరం కొత్తపేటకు చెందిన పులివేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంత్రులు, వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రసంగాలకు ప్రజలు తమ కరతాళ ధ్వనులతో మద్దతు తెలియజేశారు. సభ విజయవంతం కావడంతో స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యతో పాటు నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.


గీతాలు ఆలపిస్తున్న వంగపండు ఉష బృంద సభ్యులు


తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన


ముచ్చర్ల మహిళల కోలాటం


జాతీయ రహదారికిరువైపులా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు


విజయనగరం కళాకారుల పులివేషాలు

తప్పులను సరిచేసుకోవాలి..

- జిల్లా వ్యవసాయాధికారి రామారావు


జామి: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు

జామి: పంట నమోదులో (ఈ క్రాప్) ఏమైనా తప్పులు దొర్లితే సరిచేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. భీమసింగి రైతుభరోసా కేంద్రం వద్ద ఈ క్రాప్‌పై నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, జాబితాలను పరిశీలించి అభ్యంతరాలను తెలియజేయాలని కోరారు. తప్పుల సవరణకు శనివారం సాయంత్రం వరకు గడువు ఉందన్నారు. అనంతరం రైతుల పేర్లు, పంటల వివరాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో కొత్తవలస ఏడీఏ విజయ, వ్యవసాయ మండలి చైర్మన్ (జామి) గేదెల రమణబాబు, వ్యవసాయ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.


కొత్తవలస: రెల్లి ఆర్‌బీకే వద్ద ఈక్రాప్ జాబితాను నోటీస్‌బోర్డులో వేలాడదీస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి రామారావు

29 లోగా సరి చేసుకోవాలి..

కొత్తవలస: ఈ క్రాప్ జాబితాలో ఎటువంటి తప్పులు దొర్లినా ఈనెల 29వ తేదీలోగా సరిచేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీటీ రామారావు అన్నారు. మండలంలోని రెల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ, ఈ క్రాప్ నమోదుపై గ్రామాల్లో సభలు నిర్వహించి రైతుల వివరాలను వెల్లడించాలన్నారున. జాబితాలో ఎటువంటి తప్పులు దొర్లినా ఈ నెల 29వ తేదీలోపు సరిచేసుకోవచ్చాన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎ.డి ఎల్.విజయ, ఏఓ మాధురిశరణ్య, పలువురు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అవగాహన..

వేపాడ: నవంబర్ 3న నిర్వహించనున్న స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే (ఎస్ఈఏఎస్) టెస్ట్‌కు సంబంధించి ఎంఈఓ బాలభాస్కరరావు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రామ్‌ప్రసాద్, హెచ్ఎం బీపీఏ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షలు..

శృంగవరపుకోట: సమస్యలు పరిష్కరించాలంటూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. అక్రమ బదిలీలు రద్దు చేయడంతో పాటు సిక్ లీవ్‌లకు జీతాలు ఇవ్వాలని కోరారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లిలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయాలతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నెరవేరుతోందన్నారు. గతంలో ప్రతి చిన్న పనికీ మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేదని.. ప్రస్తుతం ఉన్న ఊరులోనే సచివాలయంలో అన్ని పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వంలో అవనీతి తప్ప ఎటువంటి అభివృద్ధీ జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో కోట్లాది రూపాయలలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు నెక్కల శ్రీదేవి, సర్పంచ్ విరోతి కొండలరావు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వితరణ


గోవిందమ్మకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్న డీటీ రమేష్, ఆర్ఐ రాజేష్

కొత్తవలస: కొత్తవలస - ఎస్.కోట రోడ్డులోని నిహారిక ఆస్పత్రి సమీపంలో ఈ నెల 25న జరిగిన అగ్ని ప్రమాదంలో పూరి గుడిసె కాలిపోయి నిరాశ్రయురాలైన వృద్ధురాలు గోవిందమ్మకు డిప్యూటీ తహసీల్దార్ టి. రమేష్, ఆర్ఐ సీహెచ్ రాజేష్ శుక్రవారం నిత్యావసర సరుకులు అందజేశారు. బియ్యం బస్తా, నెలకు సరిపడా నిత్యావసరాలు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సాయం వచ్చేలా చూస్తామని డీటీ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు వచ్చేలా కృషి..


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ పద్మజ

- బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ పద్మజ

చీపురుపల్లి రూరల్: మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ టి. పద్మజ అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ గురుకులంలో విజయనగరం, పార్వతీపురం - మన్యం జిల్లాల్లోని 13 గురుకుల పాఠశాలలకు చెందిన తెలుగు, ఇంగ్లిష్, హిందీ ఉపాధ్యాయులకు లాంగ్వేజ్ ఓరియేంటేషన్, సీబీఎస్ఈ సిలబస్‌లపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థినులు లాంగ్వేజ్ సబ్జెక్ట్‌ల్లో మంచి పట్టు సాధించేలా వారిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఇతర సబ్జెక్ట్‌లతో పాటుగా లాంగ్వేజ్ సబ్జెక్ట్‌ల్లో ఆసక్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.రాణిశ్రీ, 13 గురుకుల పాఠశాలలకు చెందిన 106 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిబిరాలు


ముసాయిదాను విడుదల చేస్తున్న తహసీల్దార్ తదితరులు

మెంటాడ(గజపతినగరం రూరల్): ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అరుణ తెలిపారు. ఓటర్ల ముసాయిదా జాబితాను శుక్రవారం ఆమె విడుదల చేశారు. నవంబర్ 4,5 తేదీలతో పాటు డిసెంబర్ 2,3 తేదీల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.